# ఊరంతా పోచారం వెంటే..

- స్పీకర్‌కు బైరాపూర్ గ్రామానికి చెందిన 315 కుటుంబాల మద్దతు



శాసన సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డికి తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న బైరాపూర్ గ్రామస్తులు

బాన్సువాడ, అక్టోబర్ 25 : బీర్కూర్ మండలంలోని బైరాపూర్ ఊరంతా స్పీకర్ పోచారం వెంటే నిలిచింది. గ్రామానికి దాదాపు 315 దళిత కుటుంబాలు సభాపతికి మద్దతు ప్రకటించాయి. 120 ముదిరాజ్ కుటుంబాలు, 70 యాదవ, 25 కురుమ, 25 గౌడ, 25 వడ్డెర, 25 ముస్లిం, 25 నాయీబ్రాహ్మణ, కుమ్మరి, కమ్మరి, చాకలి కటుంబాలు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయి. ఆయా కుల సంఘాల ప్రతినిధులు స్పీకర్‌ను బుధవారం కలిసి తీర్మాన కాపీలను అందజేశారు. పదేండ్లలో బైరాపూర్ గ్రామానికి కోట్లాది రూపాయల నిధులు మంజూరుచేసి, అన్ని విధాలా అభివృద్ధి చేసిన పోచారం శ్రీనివాసరెడ్డినే మరోసారి గెలిపిస్తామని స్పష్టం చేశారు. దాదాపు ఊరంతా తనకు సంపూర్ణ మద్దతు ప్రకటించడంపై స్పీకర్ ధన్యవాదాలు తెలిపారు.

# కేసీఆర్ పాలనలో తెలంగాణ సుభిక్షం

- బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయం
- బీజేపీ, కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు
- బోధన్‌లో షకీల్‌దే విజయం
- విలేకరుల సమావేశంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

నవీపేట, అక్టోబర్ 25: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఎప్పుడో ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి వచ్చిన ఆయన బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రజలు కరెంటు కోతలతో నానా గోసలు పడ్డారని గుర్తుచేశారు. స్వరాష్టంలో సీఎం కేసీఆర్ రూ. లక్ష కోట్లతో విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టారని తెలిపారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, పరిశ్రమలు, గృహ అవసరాలకు నాణ్యమైన కరెంటును సరాఫరా చేస్తున్నట్లు చెప్పారు. అన్నదాతలకు రైతుబంధు, రైతు బీమా, సాగునీరు, సకాలంలో ఎరువులు, పంటలకు కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర కల్పించిన కేసీఆర్.. రైతు బాంధవుడిగా నిలిచారని కొనియాడారు. సీఎం చేపడుతున్న బృహత్తర పథకాలను చూసి ఆర్థిక శాస్త్రవేత్తలే బిత్తరపోతున్నారని అన్నారు. తెలంగాణ బాగుకోసం కేసీఆర్ తాపత్రయ పడుతుంటే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అధికారం కోసం అడ్డమైన, నిరాధారమైన ఆరోపణలతో ముఖ్యమంత్రిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ప్రాణత్యాగానికి సిద్ధపడి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ ఒక వైపు.. ఓటుకు నోటు కేసులో నోట్ల కట్టలతో అడ్డంగా దొరికిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, తెలంగాణ కోసం రాజీనామా చేయమంటే అమెరికా పారిపోయిన బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మరో వైపు ఉన్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్‌పై వ్యక్తి గత విమర్శలు చేస్తున్న రేవంత్ రెడ్డి, కిషన్‌రెడ్డి ఆయన కాలిగోటికి కూడా సరిపోరని అన్నారు. కేసీఆర్.. ప్రజలకు చెప్పింది చేసి చూపించే నాయకుడని అన్నారు. ప్రతిపక్షపార్టీల నాయకులు ఎన్ని పిచ్చికూతలు కూసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ప్రశాంత్‌రెడ్డి స్పష్టంచేశారు. బోధన్‌లో మరోసారి షకీల్ గెలుపు ఖాయమని అన్నారు.

# బీఆర్‌ఎస్‌లోకి భారీగా వలసలు

- కామారెడ్డి నియోజకవర్గంలో గులాబీ కండువా కప్పుకున్న 600 మంది
- పార్టీలోకి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

కామారెడ్డి, అక్టోబర్ 25 : బీఆర్‌ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతున్నది. కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన సుమారు 600 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్, బీజేపీకి రాజీనామా చేసి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి సమక్షంలో బుధవారం గులాబీ కండువాలు కప్పుకున్నారు. దోమకొండ మండలంలోని సంగమేశ్వర్, సీతారాంపల్లి, అంబారీపేట్, బీబీపేట్ మండలం ఉప్పర్‌పల్లితోపాటు జిల్లా కేంద్రంలోని 2వ వార్డు (రామేశ్వరపల్లి), 23వ వార్డుకు చెందినవారు బీఆర్‌ఎస్‌లో చేరగా.. జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్ ఇందుకు వేదిక అయ్యింది.

**దేశంలోనే ఎక్కడా లేని అభివృద్ధి: ప్రభుత్వ విప్**

చేరికల సందర్భంగా ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో దేశంలోనే ఎక్కడాలేని అభివృద్ధి తెలంగాణలో జరిగిందన్నారు. తెలంగాణలో అమలుచేస్తున్న పథకాలను కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో చూపిస్తే ముక్కు నేలకు రాస్తానన్నారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రంలోనే నాణ్యమైన కరెంట్ ఇవ్వడంలేని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారం కోసమే ఆరు గ్యారంటీల పేరిట మభ్యపెడుతున్నదని, 60 ఏండ్లు పాలించినప్పుడు చేయనోళ్లు ఇప్పుడేం అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. తాను ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి కామారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని గుర్తుచేశారు. మరింత అభివృద్ధి కావాలనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్‌ను ఇక్కడి నుంచి పోటీ చేయాలని కోరినట్లు చెప్పారు. అందరం కలిసి ఒక్క ఓటు కూడా పోకుండా కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

**కేసీఆర్ వస్తే మరింత అభివృద్ధి: ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి**

ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. కామారెడ్డి ఇప్పటికే ఎంతో అభివృద్ధి చెందిందని, కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటే ఆదర్శ నియోజకవర్గంగా నిలుస్తుందని అన్నారు. అన్ని వర్గాలవారికి సమన్యాయం చేసిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని అన్నారు.

**ఏకగ్రీవ తీర్మానాలు..**

ఆయా గ్రామాల ప్రజలు బీఆర్‌ఎస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు తీర్మానం చేసిన కాపీలను విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిరుమల్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, జాగృతి జిల్లా అధ్యక్షుడు అనంత రాములు, దోమకొండ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌కు చెందిన మైనారిటీ యువకులకు కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

## కాంగ్రెస్, బీజేపీ అభివృద్ధికి నిరోధకాలు

- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ, మైనారిటీ యువకులు

ఆర్మూర్, అక్టోబర్ 25: కాంగ్రెస్, బీజేపీ అభివృద్ధి నిరోధక పార్టీలని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన మైనారిటీ యువకులు, నందిపేట్ మండలానికి చెందిన బీజేపీ నాయకులు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని తన నివాసంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మూడోసారి బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. వారి మాయ మాటలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో నందిపేట మండల బీజేపీ నాయకుడు తాటికాయల సాగర్, అశోక్ ఉన్నారు.

## బీఆర్‌ఎస్‌లోకి వీహెచ్‌పీ నాయకుడు



ఖలీల్‌వాడి, అక్టోబర్ 25 : నగరానికి చెందిన విశ్వహిందూ పరిషత్ నాయకుడు కాలభైరవ శ్రీనివాస్ బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా తన నివాసంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## ఎమ్మెల్యే జాజాల ఆధ్వర్యంలో చేరికలు..



సదాశివనగర్, అక్టోబర్ 25: మండలంలోని ధర్మారావుపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కారంకంటి రవి, అంకం బాల్‌రాజు బుధవారం జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు మోహినుద్దీన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగాగౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ నర్సింహులు, రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌నాయక్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ భూంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే షిండే సమక్షంలో..



నిజాంసాగర్, అక్టోబర్ 25: జుక్కల్ మండలంలోని బస్వాపూర్ గ్రామ వార్డు సభ్యుడు వాగ్మారే సంతోష్ బీజేపీ నుంచి బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే హన్మంత్ షిండే బిచ్కుంద మండల కేంద్రంలోని తన నివాసం వద్ద గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నాయకులందరూ బీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారని తెలిపారు.